

ఆఫీసులో పనిచేసుకుంటున్న శ్రీ బాపు.

# ఆంధ్రుల అభిమాన చిత్రకారుడు! బాపు

కొన్ని సంవత్సరాల క్రితం 'అంతర్జాతీయ పత్రికలసంస్థ' (ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్) డైరెక్టర్ శ్రీ జిమ్‌రోజ్ మా కార్యాలయానికి వచ్చారు. అప్పుడు ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 'రాజా-రైతూ' బొమ్మల కథ పడుతోంది. ఆవారం సంచిక పేజీలు తిరగేస్తూ శ్రీ రోజ్ బొమ్మలు వేసింది 'ఎవ'రని అడిగారు. మద్రాసులోనే ఉండే 'బాపు' అనే ఆయన వేస్తున్నారని చెప్పాము. వాటిని చాలా మెచ్చుకుని ఈ బొమ్మలు తాను ప్రపంచంలో చూసిన తక్కినవాటికి ఏవిధం గానూ తీసిపోవన్నారు.

ఈ అభిప్రాయంతో ఏకీభవించని వారుండరు. ఇప్పటికి సుమారు ఒక దశాబ్దంగా కంటికి ఇంపైన చిత్రాలతో శ్రీ బాపు ఆంధ్రప్రజానీకానికి ఎనలేని ఆనందం చేకూరుస్తున్నారు! శ్రీ బాపు బొమ్మలు చూడగానే గుర్తుపట్టేవిగా ఉంటాయి. అసలు, 'బాపు బొమ్మ' అందానికి ప్రమాణం అయిపోయింది.

ఆంధ్రదేశమంతటా అన్నివర్గాల వారి అభిమానాన్ని చూరగొన్న కళాకారుడు బాపు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. 'బంగారం-సింగారం', 'బుడుగు', 'మనవాళ్లు' చూసి, చదివి ఆనందించని తెనుగువారే ఉండరు. కాని శ్రీ బాపు అతి నిరాడంబర వ్యక్తి. ఆయనకు ప్రచారం గిట్టదు. సన్నిహితులకు తప్ప లక్షలాది పాఠకులకు శ్రీ బాపును గురించి ఏమీ తెలియదు. [వారి వివరాలు తెలుపమని కోరుతూ మా కార్యాలయానికి ఎన్ని ఉత్తరాలు వస్తాయో లెక్కలేదు!] ఆయన కూడా పత్రికలలో ప్రచారానికి ఇష్టపడలేదు!

జూలై 22 వ తేదీ 'సెవెన్‌స్టార్ సిండికేట్'—బాపు అభిమానుల సంఘం-వారు హైదరాబాదులో బాపు బొమ్మల ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శన వివరాలు అన్ని వార్తాపత్రికలలోనూ వచ్చాయి. ఈ సందర్భంలో 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' పాఠకులకు శ్రీ బాపును వ్యక్తిగతంగా పరిచయంచెయ్యవచ్చు కదా అని ఆయన ఫోటో ఒకటి వేసేందుకు అనుమతికోరాము. ఈ పేజీలోని ఫోటో ఆయనఇచ్చిందే!

శ్రీ బాపు అసలుపేరు సత్తిరాజు లక్ష్మీనారాయణ. పశ్చిమగోదావరి జిల్లాలో నర్సాపురంలో డిసెంబర్ 1933లో జన్మించారు. చదువు మద్రాసులోనే పూర్తయింది; బి. కాం., బి. ఎల్. పట్టభద్రులు (మద్రాసు లయోలా, లా కాలేజీలలో). ఎడ్వొకేట్ గా 'ఎన్‌రోల్' అయినా ఆ వృత్తిమీద ఆసక్తి లేక వదిలివేశారు. వివాహం అయింది. ఒక కుమార్తె. ప్రస్తుతం సుప్రసిద్ధ ప్రకటనాసంస్థ ఎఫిషెంట్ పబ్లిసిటీస్ లో పనిచేస్తున్నారు. పై ఫోటో ఆఫీసులో ఆయన తోటి ఉద్యోగి ఒకరు తీశారు. చిత్రకారుడు శంకర్, బాపు తమ్ముడు-పూర్తిపేరు శంకరనారాయణ. రేఖ, శేష, రంగ అనే పేర్లతో వేసిన బొమ్మలు శ్రీ బాపు వేనని ఇప్పుడు బయటపడిపోయింది!